ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023 5 కర్నూలు

పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పేరుకే 'సిబిఎస్ఇ'

- ఉపాధ్యాయులకు శిక్షణ లేదు...
- బోధించడానికి పుస్తకాలు లేవు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

'ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సిబిఎస్ఇ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధంగా ఉంది' అని ఇటీవల నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు ఇవి. సిబిఎస్ఇ విధానాన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నప్పటికీ అందుకు తగ్గ ముందస్తు ప్రణాళికను విద్యాశాఖ అధికారులు చేపట్టలేదు. ఇప్పటివరకు విద్యార్థులకు బోధించడానికి పాఠ్య పుస్తకాలు కూడా అందజేయలేదు. కర్నూలు జిల్లాలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విధానాన్ని దాదాపుగా 90 పాఠశాలల్లో అమలు చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాలలకు సిబిఎస్ఇ గుర్తింపును కూడా పొందింది. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు ఆ స్థాయి సిలబస్‌కు సంబంధించిన శిక్షణ కూడా ఇవ్వలేదు. గతంలో కేవలం నామమాత్రంగా వారం రోజులపాటు సిబిఎస్ఇ సిలబస్ శిక్షణ పేరుతో తూతూ మంత్రంగా శిక్షణ ఇచ్చి ముగించేశారు. ఇప్పుడు పాఠశాలల్లో విద్యార్థులకు సిబిఎస్ఇ సిలబస్‌ను బోధించేందుకు ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం సిబిఎస్ఇ కింద పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాల్సి ఉంటుంది. ఇప్పటినుండే శిక్షణ పూర్తి స్థాయిలో ఇస్తే ఆ పరీక్షల్లో విద్యార్థులు రాణిస్తారు. ఇప్పటివరకు ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి శిక్షణ అందించలేకపోవడంతో విద్యార్థులకు కూడా బోధించని పరిస్థితి నెలకొంది. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించాల్సిన విద్యాశాఖ చేతులెత్తేసింది. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు లేకపోతే ఎలా చదువుకుంటారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా కొన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుని అమలు చేయకుండా ఏకంగా ఎక్కువ పాఠశాలల్లో సిబిఎస్ఇ బోధన చేపట్టడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇచ్చి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలి

- యుఆర్ఎ.రవికుమార్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు

ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ విధానాన్ని అమలు చేసినట్లు ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేస్తుంది. అయితే పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు లేకుండా ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వకుండా బోధన చేయడం కష్టతరమవుతుంది. ఈ విధానంపై ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి అనంతరం అమలు చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

సిబిఎస్ఇ విధానం అమలుకు చర్యలు

- వెంకట రంగారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలో 90 పాఠశాలల్లో సిబిఎస్ఇ విధానం కింద ఏడాది నుండి బోధన జరుగుతుంది. ఉపాధ్యాయులకు గతంలో శిక్షణ ఇచ్చాం. మరోసారి కూడా శిక్షణ ఇస్తాం. విద్యార్థులకు ఆ కంటెంట్‌కు అనుగుణంగా బోధన చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

'నగరడోనా'ను వేగవంతం చేయాలి

- మహాపాదయాత్రను జయప్రదం చేయండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

నగరడోనా రిజర్వాయర్ నిర్మాణాన్ని కాలయాపన చేయకుండా వేగవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. ఆదివారం చిప్పగిరి మండలంలోని నగరడోనా రిజర్వాయర్ నిర్మాణ పనులను సిపిఎం బృందం పరిశీలించింది. నగరడోనా గ్రామంలో రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కరువు మండలమైన చిప్పగిరి, హాలహర్వి మండలాల్లో సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి రూ.12 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. రైతుల నుంచి 610 ఎకరాలు భూ సేకరణ చేపట్టి అప్పటి ధర ప్రకారం నిధులు ఇచ్చినా రిజర్వాయర్ నిర్మాణం మొదలుపెట్టలేదని చెప్పారు. 2021లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ మళ్లీ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేసి రెండేళ్లయినా పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం రూ.53.82 కోట్ల నిధులను రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించినా పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. 2008లో అప్పటి ధరకు రైతులు భూములు ఇవ్వగా 15 ఏళ్లయినా పూర్తి కానందున రైతులకు 2023 భూముల ధరకనుగుణంగా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి డిసెంబర్ నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందించాలని కోరారు. పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగునీటి కోసం రిజర్వాయర్లు పూర్తి చేసి, విద్యార్థులకు, యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 26న ఆదోని నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు మహాపాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మహా పాదయాత్రలో రైతులు, యువకులు, కార్మికులు, విద్యార్థులు, అన్నిరంగాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, మండల నాయకులు కెపి.నారాయణ స్వామి, ఈరన్న, కృష్ణ, మైనా పాల్గొన్నారు.

బీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ / హాస్పిటల్

బీడి కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

బీడి కార్మికులకు సంక్షేమ పథకాలు ఇఎస్ఐ పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని బీడీ వర్కర్స్ కాలనీలలో శని, ఆదివారాల్లో పర్యటించారు. కర్నూలు ఓల్డ్ సిటీ ప్రాంతంలో కల్లా, అలీషేర్‌బాగ్ , గంగావతినగర్, వీకర్ సెక్షన్ కాలనీలలో ఓబులు పర్యటించి బీడీ కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప, ఓల్డ్ సిటీ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ్, బీడీ యూనియన్ నాయకులు ఎగ్బాల్ హుస్సేన్ , అవాజ్ నగర కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్, మహబూబ్ బాషా , మునామియా కార్మికులు రాముడు, మినీల్లా , చాంద్ బాష పాల్గొన్నారు. వీకర్ సెక్షన్ కాలనీలో ఎస్.శ్యామలమ్మ ,ఎస్.షబానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడారు. బీడీ కార్మికులు చాలీచాలని వేతనాలతో చిన్నపాటి ఇళ్లలో నివాసం వుండి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వారి సమస్యలను కార్మిక శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని తెలిపారు. 1000 బీడీలకు అర్ధ కేజీ ఆకు వేసి దీంట్లోనే చేయాలని కండిషన్లతో పని చేయించుకుంటూ అతి తక్కువ కూలీలు ఇస్తున్నారన్నారు. సరైన కూలీలు ఇవ్వకుండా బీడీ కార్ఖానా యజమానులు దోపిడీ చేస్తున్నారని తెలిపారు. కార్ఖాన యజమానులు కాకుండా మధ్యదళారుల ద్వారా ఆకు సప్లయ్ చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో బీడీ కార్మికులకు నెలకు రూ.1500 పెన్షన్ ఇస్తున్నారని, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో బీడీ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. బీడీ కార్మికులకు క్షయ, కీళ్ళు, నడుముల నొప్పులు చాలామంది బాధపడుతున్నారని తెలిపారు. వారికి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించి బీడీ కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విపరీతంగా పెరిగిన ధరలకు అనుగుణంగా బీడీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదని ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. కనీసం బీడీ కార్మికులకు వేయి బీడీలకు రూ.500 ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం బీడీ కార్మికులకు సంక్షేమాన్ని విస్మరించాయన్నారు.

బీడి కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు

పకడ్బందీగా 'ఫ్యామిలీ ఫిజీషియన్'

- డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రామగిడ్డయ్య

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడానికి ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని గతేడాది అక్టోబర్ 21న ట్రయల్ రన్‌తో అమలు చేసింది. ఈ విధానంలో ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ ఇద్దరు వైద్యాధికారులు నియమించి వారిలో ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు, మరో వైద్యాధికారి గ్రామీణ ప్రాంతంలో ప్రజల వద్దకు వెళ్లి ఆరోగ్య సేవలు అందిస్తారు' అని కర్నూలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రామ గిడ్డయ్య తెలిపారు. పట్టణ గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆయన ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

జిల్లాలో ఎన్ని ఆరోగ్య సంస్థలున్నాయి..? అందులో సిబ్బంది నియామకం పూర్తిస్థాయిలో చేశారా..?

డిఎంహెచ్ఒ : జిల్లా వ్యాప్తంగా 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 1 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, 24 ఇన్‌టు 7 పని చేసే 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 ఏరియా ఆసుపత్రులు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 7 బ్లడ్ బ్యాంక్స్, 5 రక్త నిల్వ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాము.

ఆరోగ్య సంస్థల్లో ఎలాంటి సేవలు అందిస్తున్నారు..?

డిఎంహెచ్ఒ : జిల్లావ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సంస్థల ద్వారా ప్రజలకు పలు రకాల ఆరోగ్య సేవలు నిత్యం అందిస్తున్నాం. ప్రధానంగా కోవిడ్ కాలంలో 12 నుండి 14 సంవత్సరాల వయస్సు ఉన్న 81,696 మందికి, 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న 1,72,750 మందికి, 18 సంవత్సరాలు పైబడిన 5,74,030 మందికి కోవిడ్ వ్యాక్సినేషన్ వేయించాం. హెల్త్ కేర్ వర్కర్స్ 22,914 మందికి, ఫ్రంట్ లైన్ వర్కర్స్ 41,125 మందికి, 60 సంవత్సరాలు పైబడిన 1,66,968 మందికి ఫ్రీ కాషినరిగా డోస్ ఇచ్చాం. ఇంకా మాత శిశు సంక్షేమ, వ్యాధి నిరోధక టీకాలు, జాతీయ క్షయ నివారణ, జాతీయ కుష్టు నివారణ, అసంక్రమిత వ్యాధులు, జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, డాక్టర్ వైయస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్, రక్తహీనత నివారణ సేవలు అందిస్తున్నాం.

జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు సేవలు ఎలా ఉన్నాయి..?

డిఎంహెచ్ఒ : జిల్లావ్యాప్తంగా డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు సేవలు అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 4,351 పాఠశాలలో 6,73,728 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాం. వీరిలో దృష్టి లోపాలు ఉన్న పిల్లలు 37,329 మంది విద్యార్థులు ఉన్నారు. 14,525 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశాం. 164 మంది విద్యార్థులకు శస్త్ర చికిత్సలు నిర్వహించాం. అలాగే 97,589 మంది అవ్వ తాతలకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 29,475 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశాం. 21,963 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు నిర్వహించాం. డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ సేవల కింద 2,66,291 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించి రూ. 633.617 కోట్లు అందజేశాం. గత ఆరు నెలల కాలంలో ఆరోగ్యశ్రీలో 1,76,708 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించి రూ.374.65 కోట్లు, ఆరోగ్య ఆసరా కింద 73,652 మందికి రూ.37.95 కోట్లు అందజేశాం.

పట్టణ గ్రామీణ స్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం సేవలు ఎలా ఉన్నాయి? అన్ని కేంద్రాలకు భవనాలు ఉన్నాయా..?

డిఎంహెచ్ఒ : జిల్లాలో మొత్తం విలేజ్ వార్డు సచివాలయాలు 671(వీటిలో రూరల్ 461, అర్బన్ 210) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా ఉన్నాయి. 423 డాక్టర్ వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 332 మంది ఎంఎల్‌హెచ్‌పిలు విధులు నిర్వహిస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు నూతన భవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిలో 31 భవనాలు పూర్తయ్యాయి. 352 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. 39 రూఫ్ లైడ్ లెవెల్, 40 ఫినిషింగ్ లెవల్, 78 రూఫ్ లెవల్, 108 బేస్మెంట్ లెవెల్, 23 బిలో బేస్మెంట్ లెవెల్, 32 మొదలు కానివి, ఒకటి రద్దు చేయబడినవి ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ఎలా అమలు చేస్తున్నారు..?

డిఎంహెచ్ఒ : క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని అమలు చేయుటకు ప్రతి సచివాలయంలో నిర్దేశించిన పని దినాలలో నెలలో రెండుసార్లు వైద్యాధి కారులు, ఆరోగ్య సంచార యూనిట్ (104) ద్వారా 25 మండలాలలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఆరోగ్య సేవలు అందిస్తున్నాం. ఒక వైద్యాధికారితో పాటు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, ఆరోగ్య సంచార సిబ్బంది సేవనందిస్తారు. 67 రకాల మందులు, 67 రకాల పరికరాలు, 14 రకాల డయాగ్నస్టిక్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు రెఫెరల్ మేనేజ్మెంట్ సేవలు అంటే ఎంఎల్‌హెచ్‌పి లేదా ఏఎన్ఎం ఆరోగ్య మిత్రగా వ్యవహరిస్తూ ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చే వరకు రోగిని అనుసరిస్తారు. అనంతరం ఆరోగ్యశ్రీ కింద డిశ్చార్జ్ అయిన రోగులకు తదుపరి చికిత్సలు అందిస్తారు. ఇంకా టెలిమెడిసిన్ సేవలు అందించేందుకు ఒక జనరల్ ఫిజీషియన్, ఒక గైనకాలజిస్ట్, ఒక పీడియాట్రీషియన్, ఇద్దరు మెడికల్ ఆఫీసర్స్ అందుబాటులో ఉంటారు. ఈ సేవలో డాక్టర్ వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ నుండి ఎంఎల్‌హెచ్‌పి ద్వారా పేషంట్ వివరాలను మెడికల్ కాలేజీలోని హబ్స్‌కు సమాచారం చేరవేసి తగిన ట్రీట్మెంట్ పేషెంట్‌కు అందిస్తారు.

ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు పూలమాలలతో స్వాగతం పలుకుతున్న స్థానికులు

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. 12వ వార్డ్ 28వ సచివాలయం పరిధిలో ఉన్న ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్ అని అన్నారు. సాయంత్రం కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీధిలో ఉన్న డ్రైనేజీ, మురికి కాలువల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు ఎమ్మెల్యే సనుకూలంగా స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నేడు అంగన్వాడీ వర్కర్ల మహాధర్నా

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : ఈనెల 10,11 తేదీలలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 36 గంటల మహాధర్నా ధర్నా చేయనున్నారు. ధర్నా చౌక్‌లో నిర్వహించే ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ హాజరవుతున్నారని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు పి.నిర్మల తెలిపారు.

పత్తి పంట ధ్వంసంపై కేసు నమోదు

ప్రజాశక్తి- సి బెళగల్ : మండలంలోని తిమ్మందొడ్డిలో సుధాకర్‌కు చెందిన పత్తి పంటను ధ్వంసం చేసిన టి.వెంకటేష్ పై ఎస్ఐ పీరయ్య ఆదివారం కేసు నమోదు చేశారు. సర్వే నంబర్ 52/1 లో 95 సెంట్లు భూమి తమదంటే తమదని సుధాకర్, వెంకటేష్ లు కోర్టులకెక్కారు. కోర్టులో ఉండగా సుధాకర్ విత్తనం సాగు చేశారన్న అక్కసుతో వెంకటేష్ ధ్వంసం చేశాడు. దీంతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పత్తికొండ : ఆలూరు తాలూకా మరకట్టు గ్రామానికి చెందిన సెల్వ(35) పత్తికొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఆదోని రోడ్డులోని పుష్ప హాస్పిటల్ దగ్గర ఆటో ఢీకొని అక్కడికక్కడే మతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం కోసం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సమిష్టిగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన చేసేలా చర్యలు చేపట్టాలని, జరిమానాల కంటే అవగాహన కల్పించడం ముఖ్యమని జిల్లా పోలీసు యంత్రాంగం సమిష్టిగా కృషి చేసి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ తెలిపారు. గత 6 నెలలుగా (జనవరి నెల నుండి జూన్ నెల వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు తీసుకున్న చర్యల వివరాలను ఆదివారం విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 3,506 కేసులు నమోదు చేశామన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 37,483 కేసులు, మైనర్ల పై 303 కేసులు నమోదు చేశామన్నారు. ఒన్ వేలో రాంగ్ రూట్ వెళ్ళిన వారిపై 1,393 కేసులు, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై 1,716 కేసులు, జంపింగ్ సిగ్నల్స్ చేసిన వారిపై 58 కేసులు నమోదు చేశామన్నారు. ఎలాంటి రికార్డులు, పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారి పై 64,926 కేసులు నమోదు చేవామన్నారు. సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు , జీపులు , తదితర వాహన చోదకుల పై 4,127, అతి వేగంతో వెళ్లిన వాహనాల పై 12,214, ఓవర్ లోడ్‌తో వెళ్ళిన వాహనాల పై మోటారు వాహనాల చట్టం కింద 1,819 కేసులు నమోదు చేశామన్నారు. త్రిబుల్ రైడింగ్ పై 6,612 కేసులు, రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలపై 4,230, రాంగ్ పార్కింగ్ చేసిన త్రీవీలర్ ఫోర్ వీలర్ వాహనాలపై 3,602 , నంబర్ ప్లేట్ లేని వాహనాలపై 2,536 , డ్రంకెన్ డ్రైవ్ పై 819 కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం 5 లక్షల 59 వేల ఈ-చలనాలు పెండింగ్ లో ఉన్నాయని, ఇందులో(జనవరి నుండి జూన్ వరకు) 1, 55, 947 ఈ- చలనాలను (రూ. 3 కోట్ల 6 లక్షల 4 వేల 445) రికవరీ చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా, రహదారులపై ఇబ్బందికరంగా వాహనాలు నిలిపినా వెంటనే డయల్ 100 కు సమాచారం చేరవేయాలని జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులు కల్పించాలి : వ్యకాసం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పసుపల గ్రామంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటరాముడు డిమాండ్ చేశారు. ఆదివారం పసుపల గ్రామంలో వ్యవసాయ కూలీలతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కూలీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కె.వెంకటరాముడు, మండల నాయకులు ఉషనయ్య మాట్లాడుతూ పసుపల గ్రామంలో 10 సంవత్సరాల నుండి ఉపాధి పనులు పెట్టడం లేదని, ఉపాధి పనులు లేక వ్యవసాయ కూలీలు కర్నూలు నగరానికి వెళ్లి పనులు వెతుక్కోవాల్సి వస్తుందన్నారు.అక్కడ పనులు దొరికితే చేసినట్టు లేక పోతే ఉసూరుమంటూ వినతిరగాల్సి వస్తోందన్నారు. అధికారులు జోక్యం చేసుకుని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సింది పోయి అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని విమర్శించారు. ఉపాధి పనులకు వెళ్ళడానికి కూలీలు సిద్ధంగా ఉన్నారని, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఉపాధి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని యడల కూలీలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుందరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి రావు, నాగేశ్వరమ్మ, సరస్వతమ్మ, నాగరాజు, అయ్యన్న, దేవమ్మ పాల్గొన్నారు.

పసపలలో ఉపాధి కూలీల నిరసన

స్థానిక సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.మహమ్మద్ షరీఫ్ చెప్పారు. ఆదివారం కర్నూలు నగరంలోని రెండో వార్డు, మూడో వార్డులో సమస్యలతో ప్రజానీకం సతమతమవుతా ఉన్నారని నగర పాలక మండలి, కార్పొరేషన్‌కమిషనర్, అధికారులు పట్టించుకోవడం లేదని ఎక్కడి సమస్యలు ఆక్కడే ఉన్నాయని వారు ధ్వజమెత్తారు. నగరంలో ఉండే వీధులలో ఎక్కడ చూచిన చెత్తాచెదారంతో కంపు కొడుతున్నాయని వారు తెలిపారు. తగిన పారిశుధ్య సిబ్బంది లేనందు వల్ల అనేక వీధులలో మురుగు కాలువలు నిండి పొరులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పైన చెత్త పన్ను కరెంటు చార్జీల మోత, ఆర్టీసీ బస్సు చార్జీలో మోత మోగుతుందన్నారు. తక్షణమే వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలందరిని సమీకరించి వైసిపి సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వార్డు సహాయ కార్యదర్శి నూర్‌బాషా ,రాజు ,పెద్ద మద్దిలేటి, అబ్దుల్లా, చిన్న మద్దిలేటి ,అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నగర నాయకులు షరీఫ్

పేదలకు దోమ తెరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

దోమతెరలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని , అందరికీ అవగాహన కల్పించాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. ఆదివారం కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లో సద్గురు దత్త పాలిక్లినిక్ లో పేద మహిళలకు దోమతెరలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా విజ్ఞానవంతులు, చదువుకున్న వారు బాధ్యత గలవారు సీజనల్ వ్యాధుల పట్ల అందరిలో అవగాహన కల్పించాలన్నారను. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ , మెదడు వాపు వ్యాధులు సంభవిస్తాయని చెప్పారు. వర్షాకాలంలో కలుషితమైన నీరు తాగడం వల్ల టైఫాయిడ్, పసిరికలు కలరా, గ్యాస్ట్రో, అమీబియాసిస్ వంటి వ్యాధులు వస్తాయని నీటిని కాచి చల్లార్చిన వాటిని తాగాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ మెగా ఉచిత వైద్య శిబిరం కర్నూల్ నగరం వడ్డేగేరిలోని మస్జిద్ మర్కజే ఇస్లామిలో జేమ్ కేర్ కామినేని హాస్పిటల్, మస్జిద్ మర్కజే మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి షుగర్, బిపి, ఇసిజి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా జమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌ఎండి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంతోమంది పేదలు, ఆర్థిక స్థోమతలేకరోగాలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారికి వైద్య పరీక్షలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. నిర్వహకులు మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 2 వరకు వైద్యశిబిరం నిర్వహించామని చెప్పారు. వైద్యంతో పాటు మందులు కూడా ఉచితంగా అందించామన్నారు. వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర చెరుకు, డాక్టర్ జివిఎస్.రవిబాబు, డాక్టర్ విహెచ్.శ్రుతి, కామినేని హాస్పిటల్ జనరల్ మేనేజర్ నదీమ్, డిజిఎం రమణబాబు పాల్గొన్నారు

ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎండి డాక్టర్ చంద్రశేఖర్

ఎకరాకు రూ.30 వేలు చెల్లించాలి

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకూ రూ.30 వేల ఇన్స్యూరెన్స్ పరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు మాట్లాడారు. గతేడాది ఇన్స్యూరెన్స్ పరిహారాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో విడుదల చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది రైతులు పంటలను నష్టపోతే కేవలం 10 లక్షల మందికే రూ.1,170 కోట్లు విడుదల చేశారని చెప్పారు. గతేడాది 13 లక్షల మందికి రూ.2,900 కోట్లుబీమా పరిహారం కింద అందించారని తెలిపారు. దాదాపు రూ.1,800 కోట్లు తక్కువగా అందించి బీమా సంస్థలకు ఆ మొత్తాన్ని మళ్లించారని చెప్పారు. అలాగే 2020వ సంవత్సరంలో రూ.1,700 వైఎస్ఆర్ బీమా పరిహారం కింద రైతులకు అందించారని తెలిపారు. ఈ ఏడాది మాత్రం పిఎం ఫసల్ బీమా పథకంతో అనుసంధానం చేయడం వల్ల లక్షలాది మంది రైతులు రాష్ట్రవ్యాప్తంగా బీమా పరిహారం అందకుండా పెద్ద ఎత్తున నష్టపోయారని తెలిపారు. వెంటనే పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం కింద ఎకరాకు రూ.30 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. బీమా పథకం అమలు లోపభూయిష్టంగా ఉదన్నారు. వెంటనే పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.

తీవ్ర తాగునీటి ఎద్దడి

- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

మండలంలోని వివిధ గ్రామాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు అడగంటిపోవడంతో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొందని, దీనికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. ఆదివారం బి.వీరారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధానంగా పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, మదిరే, హనవాళ్ గ్రామాలలో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకులు ఎండిపోయాయని తెలిపారు. అలాగే కుప్పగల్లు, నెమలికల్లు ఎస్ఎస్ ట్యాంకులు అడుగంటిపోయాయని చెప్పారు. ప్రజలకు తీవ్ర నీటి కష్టాలు ప్రారంభమయ్యాయని, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎక్కడికక్కడ గ్రామాల్లో ఉన్న బోరుబావులు లేదా ప్రయివేట్ బోర్ల ద్వారా నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేకంగా ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి నివారించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయం ముందు ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల నాయకులు శేఖర్, పాండవగల్లు, గణేకల్లు, కుప్పగల్లు, కొత్తూరు, బసరుకోడు, సంతేకుడ్లూరు, హనవాళ్ గ్రామాల శాఖ కార్యదర్శులు విరుపాక్షి, పాండురంగ, హనీఫ్ బాష, రంగనాథ్, దస్తగిరి బాషా, మునిస్వామి పాల్గొన్నారు.

ఘనంగా మనోజ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ఆదోని ఎమ్మెల్యే తనయుడు, వైసిపి ఇన్‌ఛార్జీ వై.జయమనోజ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా ఆధ్వర్యంలో పట్టణంలోని అభయాంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి శైలజమ్మ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ... జయ మనోజ్ రెడ్డి ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాజకీయంగా ఎదిగి ఉన్నత పదవులు అలంకరించి ప్రజా సేవకే అంకితం కావాలని ఆకాంక్షించారు. శ్రీలక్ష్మి, నారి తాయన్న, భవాని, లక్ష్మీనారాయణ, నల్లా రెడ్డి, అయ్యప్ప, కుప్పయ్య, సింహం నాగేంద్ర, బాష బాయి, రామదాస్, ఫయాజ్, రమేష్ చంద్ర, మహిళా నాయకులు జిలేఖ, శ్రీలక్ష్మి, శ్రీదేవి, సుగుణమ్మ, కల్పవల్లి, ఆంధ్ర లక్ష్మన్న, రాము, హరి, రామకృష్ణ పాల్గొన్నారు.

దిగిరాని టమోటా..!

- మండుతున్న కూరగాయల ధరలు

ప్రజాశక్తి - హొళగుంద

టమోటా ధర దిగి రావడం లేదు. కూరగాయల ధరలు మండుతుండడంతో 'ఏం కొనలేం. తినలేం' అంటూ వినియోగదారులు వాపోతున్నారు. టమోటా ధరలు రూ.100 నుంచి రూ.130లకు పెరిగాయి. వివిధ కూరగాయల ధరలు కూడా రూ.50కి పైమాటే పలుకుతున్నాయి. ఈ ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారాయి. గత రెండేళ్లుగా టమోటా ధరలు రూ.70, 80 వరకు పెరిగాయి. ఏకంగా రూ.130లకు చేరడం ఇదే మొదటిసారి అని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పండించిన రైతుల నుంచి మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు కొనుగోలు చేయడం వల్ల కూరగాయల ధరల అమాంతం పెరిగిపోతున్నట్లు సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర కిలో టమోటా తీసుకెళ్తే రెండు పూటలు కూడా సరిపోవడం లేదని దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం వంటల్లో టమోటాను తగ్గించి చింతపండుతో సరిపెట్టుకుంటున్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు. ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ శ్రేయస్సు అని గొప్పలు పాలకులు చెప్పుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నేరుగా రైతుల నుంచి టమోటాను కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందించడంతో పాటు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల ప్రభుత్వ అమ్మకం కేంద్రాలను మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

మహాపాదయాత్రను జయప్రదం చేయండి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు కోరారు. ఆదివారం పట్టణంలోని శివ సర్కిల్ వద్ద ఉన్న కెవిపిఎస్ జిల్లా ఉప కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధిని కోరుతూ, ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి చూపాలని, విద్య, వైద్య రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దళితుల సమస్యలను కూడా ప్రధాన అజెండాగా చేర్చి నిర్వహిస్తున్న సిపిఎం మహా పాదయాత్రకు సంపూర్ణ సంఘీభావం తెలియజేసి, పాదయాత్రలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఆదోని మండలం హానవాలు మొదలుకొని, పెద్దహరివాణం, దొడ్డనగేరి, నాగనాథహళ్లి, సంతేకుడ్లూరు, తుగ్గలి మండలం రాతన, గూడూరు మండలం గుడిపాడు, సిబెళగల్ మండలం బ్రాహ్మణపల్లె, పత్తికొండ మండలం హోసూరు, కోడుమూరు మండలం అనుగొండతో పాటు మరో 10 గ్రామాల్లో ప్రతిఘటన పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ప్రతిఘటన పోరాటం నిర్వహించిన ప్రతి ప్రాంతంలోనూ సిపిఎం దళితులకు అండగా నిలిచిందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిని కోరుతూ ఈనెల 26 నుంచి 31 వరకు ఆదోని నుంచి కర్నూలు దాకా మహా పాదయాత్రను చేపట్టడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. పాదయాత్రకు సంఘీభావం తెలియజేసి, ప్రత్యక్షంగా పాల్గొని, దళితుల సమస్యలను ప్రధాన రాజకీయ అజెండాగా మారుద్దామని కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, ఎన్‌జి.కృష్ణ, బి.కరుణాకర్, హెచ్.జయరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు గిత్తరి రమేష్, ఆంధ్రా గురుస్వామి, ఎం.భాస్కర్, మామిడికాయల రాజు, హెచ్.చిన్న మారయ్య, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సుమాల ఆంథోని, కోసిగి, పెద్దకడబూరు, దేవనకొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు మండలాల కార్యదర్శులు రామకోటి హనుమంతు, కెబి.ఆనందరాజు, ఎం.రాజు, ఈశ్వరయ్య, రాజా రమేష్, జిల్లా కమిటీ సభ్యులు చిన్న రోషన్న, చక్రపాణి, లాజర్, మదన గోపాల్, డేవిడ్ రాజు, సుమాల రాజు, నాగప్ప, కుశలన్న పాల్గొని మాట్లాడారు.

రైతు బజార్ ఏర్పాటులో ఎమ్మెల్యే విఫలం

- సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేయడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలం చెందారని, తక్షణమే స్పందించి రైతు బజార్ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడు, సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న డిమాండ్ చేశారు. కూరగాయల ధరలు పెరగడంతో ఆదివారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్‌లో కూరగాయల దండలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూరగాయల ధరలను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. కూరగాయలను కొనాలంటే పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, మహిళా సమాఖ్య నాయకులు ఈరమ్మ, నాగవేణి, సరోజ, ప్రజాసంఘాల నాయకులు విజయేంద్ర, రాజీవ్, ఖాజా, దాదావలీ, మల్లికార్జున గౌడ్, నరసింహులు, సుంకన్న, సునీల్, శాంతప్ప, మాలిక్, హనుమంతు, ఆంజనేయ, ఖాదర్, ఇస్మాయిల్, మల్లికార్జున, కృష్ణ, రమేష్, లచ్చప్ప, వీరేష్, నాయుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి - ఆదోని

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా తెలిపారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అనంతరం ఆదోని పట్టణ నూతన కమిటీని 18 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. నూతన పట్టణ కమిటీ అధ్యక్షులుగా భరత్, కార్యదర్శి శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులుగా గౌస్, నాగరాజు, గణేష్, పట్టణ సహాయ కార్యదర్శులుగా పవన్, శశిధర్‌తోపాటు 12 మంది కమిటీ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. పట్టణంలో డిగ్రీ కళాశాల భవనం కోసం, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా, ఎయిడెడ్ విద్యా సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, స్థానిక విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రాజు, గణేష్, రాజు, ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఉపాధి హామీ చట్టం కింద మండలంలోని రైతులకు పండ్ల తోటల మొక్కలు పంపిణీ చేశారు. ఆదివారం ఎంపిడిఒ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ మండలి ఛైర్మన్ పురుషోత్తమ రెడ్డి, రోడ్ల భవనాల శాఖ కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, పెద్దకడబూరు సర్పంచి రామాంజనేయులు, ముక్కరన్నలు రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. పండ్లతోటల పెంపకంలో భాగంగా మండలంలోని 20 గ్రామాల్లో, 107 మంది రైతులు ముందుకొచ్చారని తెలిపారు. 134 ఎకరాల్లో 17,030 మొక్కలను నాటేందుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ఎంపిపి బి.శ్రీవిద్య ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల తీర్మానంతో అంచనాలు తయారు చేశామని చెప్పారు. మామిడి 168 మొక్కలు, కొబ్బరి 8,352 మొక్కలు, నల్లరేగడి పండ్లు 48 మొక్కలు, నిమ్మ 462 మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ మొక్కలను అన్ని గ్రామాల్లో ఉపాధి సిబ్బంది, మేటీల సహకారంతో నాటించినట్లు చెప్పారు. ఇంకా 8 వేల మల్లె మొక్కలు రావాల్సి ఉందన్నారు.

మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

సారూ..! ఆ భవనంలో ఉండలేం

- విద్యార్థినుల ఆవేదన

- 80 మంది విద్యార్థినులకు రెండే బాత్‌రూములు

ప్రజాశక్తి - ఆదోని

గ్రామీణ ప్రాంతాలకు చెందిన బడుగు, బలహీన వర్గాల బాలికలు ఇప్పుడిప్పుడే విద్య వైపు మొగ్గు చూపుతున్నారు. చదువు పట్ల ఆసక్తి పెరగడంతో తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రయోజకులను చేసేందుకు తోడ్పాటునందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు హాస్టల్‌లో ఉంటూ ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. వారు వసతి పొందుతున్న గృహాల్లో మెరుగైన సౌకర్యాలు, సదుపాయాలు కల్పించి, నాణ్యమైన భోజనం అందించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి. ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో విద్యార్థినులు ఉన్నత విద్యా చదువలేక ఇళ్లకు తిరిగి వెళ్తున్న పరిస్థితి ఉంది. విద్యార్థి సంఘాల పోరాట ఫలితంగా ఆదోనిలో బీసీ కళాశాల విద్యార్థినుల బాలికల వసతి గృహం మంజూరయింది. ప్రారంభంలో ఎస్‌కెడి కాలనీలో హాస్టల్ నిర్వహణ కొనసాగేది. అద్దె సమస్య తలెత్తడంతో వేరే ప్రాంతానికి షిఫ్ట్ చేశారు. సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతున్న పరిస్థితి ఉంది.

ఆ భవనంలో ఉండలేం

పట్టణ శివారులోని ఆస్పరి రోడ్డులో కళాశాల బీసీ బాలికల హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఆ భవనంలో ఇంటర్ నుంచి డిగ్రీ చదివే గ్రామీణ విద్యార్థినులు 80 మంది ఉంటున్నారు. అక్కడ సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. గది ఇరుకుగా ఉందని, వర్షాకాలం వచ్చిందంటే దోమల బెడద తీవ్రంగా ఉంటుందని విద్యార్థినులు వాపోతున్నారు. సమస్యలు చెబుదామంటే అక్కడ పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. ఆదివారం వస్తే చాలు ఆవరణలో గడ్డి, పిచ్చి మొక్కలను తమతో తొలగిస్తున్నారని పేర్కొంటున్నారు.

రెండే బాత్‌రూములు

హాస్టల్ భవనంలో 80 మంది విద్యార్థినులు ఉంటున్నారు. రెండే బాత్‌రూములు ఉన్నాయని వారు చెబుతున్నారు. తెల్లవారుజాము నుంచి అవసరాలు తీర్చుకునేందుకు వరుసలో నిలిచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. అదనంగా బాత్‌రూములు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరినా అద్దె భవనం కావడంతో పట్టించుకునే వారు లేరని విద్యార్థినలు చెబుతున్నారు.

అన్నం రుచిగా ఉండడం లేదు

ఉదయం టిఫిన్ అనంతరం కళాశాలకు బయల్దేరే సమయంలోనే మధ్యాహ్నం కోసం క్యారియర్ తీసుకుంటున్నామని, అన్నం, పప్పు, సాంబారు భోజన సమయంలోపు సప్పగా ఉంటుందని విద్యార్థినులు వాపోతున్నారు. ఆహారం రుచిగా లేకపోవడం వల్ల తినలేక పడేస్తున్నామన్నారు. హాస్టల్ భవనం నుంచి ప్రభుత్వ బాలికల కళాశాలకు 2 కిలోమీటర్లు నడుచుకుంటూ రావాలంటే ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. కళాశాల పరిసరాల్లోనే హాస్టల్ భవనం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- పరిమళ, వార్డెన్

హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ సమస్యలు ఉన్న మాట వాస్తవమే. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు కూడా త్వరలోనే సందర్శించి విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పన దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి

కళాశాల బాలికల హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి. విద్యార్థుల పట్ల అక్కడ విధులు నిర్వర్తించేవారు కఠిన వైఖరి తగదు. సమస్యలు పరిష్కరించాల్సిన వారే మొండిగా వ్యవహరించడం తగదు. అద్దె భవనం కావడంతో సౌకర్యాల్లేక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు హాస్టల్ భవనాన్ని సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. కళాశాల దగ్గరలోనే సొంత భవనం ఏర్పాటు చేయాలి. లేకపోతే విద్యార్థులను సమీకరించి ఆందోళన నిర్వహిస్తాం.

టిడిపిది 'తుస్సు యాత్ర'

- మాజీ ఎంపిపి రఘురాం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలో టిడిపి నాయకులు చేపట్టిన బస్సుయాత్ర 'తుస్సు యాత్ర' అని మాజీ ఎంపిపి రఘురాం ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఒకరిద్దరిని కురువలను బలవంతంగా పిలుచుకొని టిడిపి కండువా కప్పించారని తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కురువలకు 4 మండలాలుగా గుర్తింపు పొందే ఎన్నో పదవులు ఇచ్చారని చెప్పారు. కురువలకు రాష్ట్ర ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ పదవిని కురువ భాగ్యమ్మకు అప్పజెప్పారని తెలిపారు. 2024లో బాలనాగిరెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికవుతారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గంలోని టిడిపి నాయకులకు కూడా సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. మండలంలో ప్రతి ఇంటికీ తాగునీటి సదుపాయం కల్పించామని చెప్పారు. టిడిపి బస్సుయాత్రలో టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని విమర్శించారని తెలిపారు. 2024 ఎన్నికల్లో తిక్కారెడ్డిని 15 వేల మెజార్టీతో ఓడిస్తామని చెప్పారు. మండలంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని చూపిస్తామని, దమ్ముంటే చర్చకు రావాలని సవాలు విసిరారు.

దాతృత్వం చాటుకున్న స్నేహితులు

చిప్పగిరి : అనారోగ్యంతో తోటి స్నేహితురాలి భర్త చనిపోవడంతో ఆమె ఇబ్బందులు చూసి స్నేహితుల బృందమంతా ఆర్థిక సహాయం అందించింది. మండలంలోని నేమకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994 బ్యాచికి సంబంధించిన తిమ్మాపురం గ్రామానికి చెందిన లక్ష్మికి, ఏరూరు గ్రామానికి చెందిన బారికి వీరేష్‌తో వివాహం జరిగింది. ఆమె భర్త బారికి వీరేష్ (47) నెల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం వైసిపి కన్వీనర్ ఏరూరు రంగస్వామి ఆధ్వర్యంలో మిత్రులంతా స్నేహితురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుం బానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. స్నేహితురాలి కుటుంబ సభ్యులం దరూ మిత్రబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

డ్రెయినేజీ లేకుండా సిసి రోడ్లు

- మురుగునీరు, వర్షపు నీటికి దారేది..?

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని కొన్ని గ్రామాల్లో డ్రెయినేజీ కాలువలు లేకుండా సిసి రోడ్లను నిర్మించారు. కె.తిమ్మాపురం గ్రామంలో సిసి రోడ్లు వేశారు.. కానీ డ్రెయినేజీ కాలువను మరిచారు. వర్షపు నీరు, మురుగునీరు ఇళ్లలోకి వస్తుండడంతో సిసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ రాజ్ ఎఇ, పంచాయతీ సెక్రటరీలు కూడా ప్రణాళిక లేకుండా పనులు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లకు డ్రెయినేజీ కాలువలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో వేసిన సిసి రోడ్లకు డ్రెయినేజీ కాలువ లేకుండా నిర్మిస్తుండడంతో గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రణాళిక లేకుండా అధికారులు చేస్తున్న పనులకు పర్యవేక్షకులు ఎవరు లేరా..? ప్రజాధనంతో పంచాయతీలో చేస్తున్న పనులపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయినేజీ లేకపోతే ఇబ్బంది

డ్రెయినేజీ కాలువ లేకుండా నిర్మించిన సిసి రోడ్డు

- నల్లారెడ్డి, తిమ్మాపురం గ్రామస్తుడు

సిసి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించకపోతే ఇబ్బంది అవుతుంది. అధికారులను ప్రశ్నించినా పట్టించుకోకుండా ఇట్లే వేస్తామని అధికారులు సమాధానం చెప్పారు.

గత ప్రభుత్వం డ్రెయినేజీ నిర్మించారు

- కెటి.వెంకటేష్, తిమ్మాపురం గ్రామస్తుడు

గత ప్రభుత్వంలో సిసి రోడ్లు నిర్మించేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాలువలు నిర్మించారు. వర్షపు నీరు, మురుగునీరు రోడ్డుపైకి, ఇళ్లలోకి ప్రవేశించకుండగా డ్రెయినేజీ కాలువ గూండా పోయేవి. డ్రెయినేజీ కాలువ నిర్మించకుండా రోడ్లు వేయడం వల్ల రోడ్డు పక్కన ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఇళ్లలోకి నీరు వస్తుండడంతో దుర్వాసనకు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉంది.

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

- విఒఎల సంఘం జిల్లా అధ్యక్షులు బసవరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైకెపి విఒఎల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షులు బసవరాజు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో మండల గౌరవాధ్యక్షులు ఈశ్వర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బసవరాజు హాజరయి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద మహిళలు ఆర్థిక, సామాజిక, స్వావలంబన దిశగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేర్చడంలో విఒఎలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నిరంతరం మహిళలకు అందుబాటులో ఉండి, ప్రతి పనిలో పాల్గొని విజయవంతం చేస్తుంటారని పేర్కొన్నారు. విఒఎలకు ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్స్యూరెన్సు సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి రంగన్న, కోశాధికారి పద్మావతి, జిల్లా సలహాదారులు రామలింగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, సహాయ కార్యదర్శి భాస్కర నాయుడు, మిన్నెల్లా, మండల అధ్యక్షులు తిక్కన్న, పెద్దయ్య ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పద్మావతి, కార్యదర్శిగా దేవన్న, కోశాధికారి నాగరత్నమ్మ, ఉపాధ్యక్షులుగా నరసప్ప రెడ్డి, ఉప కార్యదర్శిగా ఉమామహేశ్వరితో పాటు మండల గౌరవాధ్యక్షులుగా ఈశ్వర్, సలహాదారులుగా దస్తగిరిని ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బసవరాజు

సైడ్ కాలువలు నిర్మించండి...

- అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉదయం లేవగానే శుభ్రంగా స్నానం చేసి యూనిఫారం వేసుకుని వెళ్లే విద్యార్థులపై బురద నీరు పడుతోందని, గ్రామంలో సైడ్ కాలువలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రోజూ ఈ సమస్య తమకు ఎదురవుతోందని మండలంలోని నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలుపుతున్నారు. నేమకల్లు గ్రామంలోకి పోవడానికి ప్రధాన రహదారిలో ఏరోజు కూడా మురుగనీరు లేని రోజు లేదని, రహదారి వెంట వెళ్లే మహిళలు, ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి వెంటే పాఠశాలలకు వెళ్లే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రద్దీ లేకుండా తిరుగుతూనే ఉంటాయి. రహదారి వెంట నడుచుకుంటూ వెళ్లే వారికి మురుకునీరు పడుతూనే ఉంటాయి. సర్దుకుపోయేవారు కొందరు. కోపగించుకుని పోయేవారు మరికొందరు. రోడ్డు ఇరువైపులా నివాసం ఉన్న వారంతా పోటీ పడి ఇంట్లోని బట్టలు ఉతికిన నీళ్లు, వేస్ట్ నీటిని రహదారులపైకి వదులుతున్నారు. మురుగునీటి వల్ల దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీరికి ఎన్నిసార్లు అవగాహన కల్పించినా, నోటీసులు ఇచ్చినా మారడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

బురద నీటిని చూపుతున్న విద్యార్థి

రోజూ ఇబ్బంది పడుతూనే ఉన్నాం

- రామ్‌చరణ్ తేజ, పదో తరగతి విద్యార్థి, నేమకల్లు

రోజూ పాఠశాలకు వచ్చే రహదారిలో ఎంత జాగ్రత్తగా వచ్చినా ఏదో ఒక వాహనం ద్వారా మా యూనిఫారంపై బురద నీరు పడుతున్నాయి. పాఠశాలలోని ఉపాధ్యాయులకు, అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించాలి.

డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

ప్రజాశక్తి-పెద్దకడబూరు

పరిసరాలను పరిశీలిస్తున్న నాయకులు

పెద్దకడబూరు ఎస్సీ కాలనీలో లింకు రోడ్లు, అంబేద్కర్ విగ్రహం నుంచి హైస్కూల్ వరకు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, మండల కార్యదర్శి దేవదాసు డిమాండ్ చేశారు. ఆదివారం డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో పర్యటించి సమస్యలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణం లేకపోవడం భారీగా మురుగునీరు, చెత్త చేరి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు రామన్న, అబ్రహాం, తాయప్ప, జీవరత్నం, ఆదెప్ప, ప్రభుదాసు, ప్రభాకర్, వంశీ పాల్గొన్నారు.

'మాధవరావుతోనే గ్రామాభివృద్ధి'

ప్రజాశక్తి - నందవరం

మాధవరావు దేశాయిని సన్మానిస్తున్న యువకులు

మాధవరావు దేశాయి తోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, తామంతా ఆయన వెంట ఉంటామని నందవరం ఎస్సీ కాలనీ 14వ వార్డుకు చెందిన యువకులు తెలిపారు. ఆదివారం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయి స్వగృహంలో దాదాపు 50 మంది యువకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడారు. మాధవరావు పాలనలో గ్రామ, వార్డు సమస్యలు పరిష్కారమయ్యాయని, మరింత అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని కోరారు. అభివృద్ధిలో సహాయం అందించేందుకు తామంతా మాధవరావు వెంట ఉంటామని తెలిపారు. ప్రకాశం, దుబ్బన్న, సలోమా, స్టీఫెన్, రంగప్ప, ఎస్సీ కాలనీ యువకులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీమఠం దివాన్ సుధీంద్రాచార్ విశేష పూజలు నిర్వహించారు. బృందావనాన్ని స్వర్ణపల్లకిలో ఉంచి వేదమం త్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పల్లకి సేవ చేయించా రు. భక్తులతో పల్లకి మోయించి శ్రీమఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు. ఊయల మండపంలో పండితులు ఊయల సేవ నిర్వహించారు.

CHANGE OF NAME

By this deed I, the undersigned B JALEEL AHMEMAD (New Name) S/o BOGGULA MOULALI. Previously called BOGGULA JALEEL AHMED (Old Name) R/o H.No. 3-275A, E.THANDRAPADU, Kurnool District, Andhra Pradesh.

జిల్లా అధ్యక్షుడిగా మల్లెల రాజశేఖర్ గౌడ్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జిల్లా ఇన్చార్జి అమర్‌నాథ్ రెడ్డి

ముందుకు సాగని 'సాగు'

- ఆత్మకూరు డివిజన్‌లో ఇపట్పి వరకు 11.09 శాతమే..
- మొత్తం 78,272 ఎకరాల విస్తీర్ణం
- కేవలం 8,683 ఎకరాల్లోనే విత్తనం
- వర్షం కోసం రైతులు ఎదురు చూపు

ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో పంటల సాగు సాగడం లేదు. ఇందుకు ప్రధాన కారణం సకాలంలో వర్షాలు పడకపోవడమే. ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాలలో ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు ఇప్పటివరకు 60 శాతం మేర విత్తనాలు వేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 11.09 శాతం మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు పడినా కుండపోతగా కురవడంతో వ్యవసాయానికి అనువుగా లేక సకాలంలో విత్తనాలు వేయడం లేదు.

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 78,272 ఎకరాలలో పంట సాగు విస్తీర్ణం ఉంది. ఇప్పటి వరకు 8683 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా మొక్కజొన్న పంట 7372 ఎకరాల్లో వేశారు. పత్తి పంటను 752 ఎకరాల్లో సాగు చేశారు. ఆత్మకూరు మండలంలో మొక్కజొన్న పంట 11,450 ఎకరాల్లో వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 4660 ఎకరాల్లో వేశారు. ఇందులో బావుల కింద 2657 ఎకరాలు, చెరువుల కింద 127 ఎకరాలు, వర్షంపై ఆధారపడి 1875 ఎకరాల్లో రైతులు వేశారు. వెలుగోడు మండలంలో ఇంతవరకు ఒక ఎకరాలో కూడా విత్తనాన్ని రైతులు వెయ్యలేదు. పాములపాడు మండలంలో మొక్కజొన్న పంట 15,707 ఎకరాలకు గాను ఇప్పటివరకు 1282 ఎకరాల్లో మాత్రమే మొక్కజొన్న పంటను వేశారు. కొత్తపల్లి మండలంలో 9627 ఎకరాలకు గాను ఇప్పటివరకు 1430 ఎకరాలలో మాత్రమే వేశారు. మరో ప్రధాన పంటగా ఉన్న వరి డివిజన్ పరిధిలో మొత్తం 19,722 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 87 ఎకరాల్లో మాత్రమే రైతులు వేశారు. అలాగే పత్తి పంట 9577 ఎకరాల్లో వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 752 ఎకరాల్లో మాత్రమే వేశారు. ఆత్మకూర్ వ్యవసాయ డివిజన్ పరిధిలో వర్షం ఏప్రిల్, మే నెలలో అనుకున్న స్థాయికి నమోదయింది. జూన్‌లో 87.5 మి.మీ వర్షపాతానికి గాను 47.9 మి.మీ వర్షం కురిసింది. జులైలో ఇప్పటి వరకు 173.0 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 111.8 మి.మీ నమోదయింది. ఈ వర్షం కూడా రెండు రోజులపాటు ఆత్మకూరు డివిజన్‌లో పడింది. సాధారణంగా జూలై 15వ లోపు రైతులు తమ వ్యవసాయ భూముల్లో పూర్తిస్థాయిలో పంటలు వేసే సంప్రదాయం ఉన్నప్పటికీ ఇప్పటివరకు డివిజన్లో వర్షాభావంతో 11.09 శాతం మాత్రమే సాగయ్యాయి. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు ఎకరాకు పదివేల రూపాయలు చొప్పున ఇప్పటికే పెట్టుబడులు పెట్టారు. కొన్ని ప్రాంతాల్లో వేసిన పంటలను వర్షం లేక చెడగొట్టారు. ఇటీవల భారీ స్థాయిలో కురిసిన వర్షపు నీరు పంట పొలాల్లో నిలిచిపోవడంతో మొలకెత్తిన మొక్కలు కూడా ఎర్రబడ్డాయి. వీటిని రైతులు చెడగొట్టి మరోసారి విత్తనాలు వేసుకోవలసిన పరిస్థితి ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో వాతావరణం అనుకూలించేనా, వర్షాలు పడేనా అని విత్తనాలు వేసిన రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- చంద్రబాబును సిఎంగా చేసుకుందాం : టిడిపి
- జిల్లా నూతన అధ్యక్షుడిగా మల్లెల రాజశేఖర్ గౌడ్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని, తక్షణమే ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం వచ్చిందని, తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పలువురు టిడిపి నేతలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల శివారు ప్రాంతంలోని రైతు నగరం వద్ద ఉన్న యాతం జయచంద్ర రెడ్డి ఫంక్షన్ హాల్‌లో టిడిపి జిల్లా నూతన అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, మాజీ మంత్రులు ఎమ్మెల్సీ ఎన్ఎండి ఫరూక్, ఏరాసు ప్రతాప్ రెడ్డి, భూమా అఖిల ప్రియ, మాజీ ఎమ్మెల్యేలు బిసి జనార్ధన్ రెడ్డి, గౌరు చరిత, అబ్జర్వర్ మురళి, కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు, యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌తో అమర్నాథ్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అమర్నాథ్ రెడ్డి మాట్లాడారు. నాటి నుండి నేటి వరకు బిసిలకు టిడిపి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నంద్యాల జిల్లాలో టిడిపి బలంగా ఉందని, ప్రతి కార్యకర్త, నాయకుడు 6 నెలల కాలంలో కష్టపడి పనిచేసి చంద్రబాబు నాయుడును గెలిపించుకోవాలని తెలిపారు. వైసిపి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్ఎండి ఫరూక్, ఏరాసు ప్రతాప్ రెడ్డి, భూమా అఖిల ప్రియ తదితరులు మాట్లాడుతూ సమయ స్ఫూర్తితో, సమన్వయంతో పని చేయాలని, స్థానికంగా వచ్చే సమస్యలను అధిగమించి ముందుకు సాగాలని నూతన అధ్యక్షుడికి సూచించారు. బిసి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గంల రెండు బాధ్యతలు ఉన్నందుకు అక్కడ గౌరు వెంకట రెడ్డి సేవలు అవసరమనే అదినాయకత్వం తప్పించా రని, ఎలాంటి అపోహలు వద్దన్నారు. నంద్యాల జిల్లాలోకి బస్సు యాత్ర రేపటి నుండి రాబోతుందని, అందరం ఐక్యంగా పాల్గొని విజయంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టిడిపి జెండా ఎగుర వేస్తామని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని 176 సీట్లలో వైసిపి ఓడిపోతుందని పీకే చెప్పారని, అందుకే జగన్ భయపడుతున్నారని అన్నారు. గౌరు చరిత మాట్లాడుతూ బిసిలకు, మైనార్టీలకు, దళితులకు టిడిపి పెద్ద పీట వేస్తుందన్నారు. ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంపై కొత్త అధ్యక్షులు దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలపైనా దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో అన్ని నియోజక వర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ముందుగా వీరు స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగానే ఆలయ అధికారులు, వేద పండితులు సంప్రదాయపదంగా స్వాగతం పలికారు. అనంతరం ముందుగా స్వామివారిని, ఆ తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వారికి వేదపండితులు ఆశీర్వచనం పలికారు. వారికి శేష వస్త్రాలను, ప్రసాదాలను, జ్ఞాపికను ఆలయ అధికారులు అందజేశారు.

చెరువులు, కుంటలు కబ్జా

- అలుగులు, కట్టలు ధ్వంసం చేసి భూమి ఆక్రమణ
- పట్టించుకోని రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు

కబ్జాకు గురైన సంత జూటూరు చందనపు చెరువు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

నేటి ఆధునిక కాలంలో మనిషి దురాశ ప్రకృతి సంపదలపై, సహజ వనరులపై పడుతోంది. వాటిని ధ్వంసం చేస్తూ స్వలాభం కోసం కబ్జాలకు పాల్పడుతున్నారు. బండి ఆత్మకూరు మండలంలో రాజుల కాలంలో ఏర్పాటు చేసిన చెరువులు, కుంటలను ఆక్రమిస్తున్నారు. రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తూ వాటి పరిరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

బండి ఆత్మకూరు మండలంలో పురాతన కాలం నుంచి ఉన్న చెరువులను, కుంటలను కొందరు స్వార్ధపరులు కబ్జాలకు పాల్పడుతున్నారు. మండలంలో దాదాపు 16 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులకు తెలుగంగ ప్రాజెక్టు నుండి నీటిని మళ్లించి తద్వారా వ్యవసాయానికి సాగునీటి వదులుతారు. మండలంలోని ఈ చెరువుల ద్వారా ప్రాచీన కాలం నుండి వ్యవసాయం చేస్తూ ప్రజలు జీవిస్తున్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతులు పెరగడంతో ఈ ప్రాంతంలోని కొందరు స్వార్ధపరులు చెరువు భూములపై, కుంట భూములపై కన్నేశారు. చెరువు అలుగులను, కుంటలను ధ్వంసం చేసి వ్యవసాయ భూములుగా మార్చేస్తున్నారు. చెరువులు, కుంటల కబ్జా విషయం రెవెన్యూ అధికారులు, మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సంత జుటూరు గ్రామంలో చందనపు చెరువు ఉంది. నారాయణపురం గ్రామంలో బ్రాహ్మణ చెరువు, కొత్తచెరువు, చిన్నదేవలాపురం గ్రామంలో తుమ్మలచెరువు, పెద్దదేవలాపురంలో ఎర్ర చెరువు, జిసి పాలెంలో పోతచెరువు, నెమల్లకుంట చెరువు, మొండికట్ట చెరువు, కృష్ణమ్మ కుంటలు ఉన్నాయి. జి.లింగాపురంలో కొత్తచెరువు, రామాపురంలో వడ్డేవానికుంట చెరువు, బండిఆత్మకూరులో చిన్న చెరువు, సింగవరంలో ఆముదాల చెరువు, బి.కోడూరులో నాగుల చెరువు, బసాపురం కుంట, కడమల కాల్వలో ప్రేమ చెరువు, ఈర్నపాడులో నాయిని చెరువులు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ప్రాచీన కాలం నుండి ఉన్న చెరువులను, కుంటలను, చెరువు భూములు కబ్జాదారుల నుండి కాపాడాలని మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

చెరువులను సంరక్షించాలి

ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు మండలంలోని చెరువులను, కుంటల సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి. వారసత్వ సంపదగా ఉన్న చెరువులను కొందరు స్వార్ధం కోసం కబ్జాలు చేస్తూ చెరువు కట్టలను, అలుగులను ధ్వంసం చేస్తూ నాశనం చేస్తున్నారు. చెరువుల భూములను సాగుగా మార్చి కబ్జా చేస్తున్నారు. కబ్జాదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలి.

కంపమల్ల చిన్న మద్దిలేటి. మాజీ జెడ్పిటిసి.

కబ్జాదారుల నుండి చెరువులను, కుంటలను కాపాడాలి

బండి ఆత్మకూరు మండలంలో ప్రాచీన కాలం నుండి ఉన్న చెరువుల కింద, నీటి కుంటలపైన ఆధారపడి వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో చెరువు భూములపై, నీటి కుంటల భూములపైన, చెక్ డాం భూములపై కబ్జాదారులు కన్నేశారు. వాటి అలుగులను, కట్టలను ధ్వంసం చేసి సాగుభూములుగా తయారు చేసుకుని కబ్జా చేస్తున్నారు. ఆక్రమణదారులపైన ప్రభుత్వం ఉక్కుపాదం మోపి వాటిని కాపాడాలి.

రత్నమయ్య, సిపిఎం బండి ఆత్మకూరు మండల కార్యదర్శి.

చౌడేశ్వరి దేవికి ముక్కెర, సిల్వర్ ఈగేస్ ఈవో రామానుజన్‌కు అందజేస్తున్న దాతలు

అమ్మ వారికి ఆభరణాలు విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి అమ్మ వారికి భక్తులు రూ.1.29 లక్షలు విలువ చేసే ఆభరణాలు విరాళంగా ఆదివారం అందజేశారు. ధర్మవరానికి చెందిన చింతా అమర్నాథ్ అమ్మవారికి ముక్కెర, సిల్వర్ ఈగేస్‌లను ఆలయ ఈవో రామానుజన్‌కు అందజేశారు. అంతకుముందు దాత అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న రీతిలో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరుకావాలని, జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా ఆవుకు మండలం సుంకేసుల గ్రామ యువకులకు క్రికెట్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న బిసి ఇందిరా

వక్ఫ్ భూముల ఆక్రమణలపై విచారణ చేపట్టాలి

- ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి మస్తాన్ వలి

ప్రజాశక్తి - నంద్యాల

వక్ఫ్ భూముల ఆక్రమణలపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపించాలని అవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ వలి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మీడియాతో ఆయన మాట్లాడారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లి జామియా మసీదు భూములు, రైతు నగరం వద్ద ఉన్న వాటిని కొనుగోలు చేసి వెంచర్లు వేసిన అమ్మకందారులు, ఆ మసీదుకు సంబంధించిన 80 ఎకరాలు, సిరివెళ్ల మండలం యాలూరులో ఉన్న భూముల పైన, నంద్యాలలో ఉన్న వక్ఫ్ భూములు, దర్గాలు, మసీదు మాన్యాలతో వస్తున్న డబ్బులు, ఖర్చులు, వాటన్నింటిపైన విచారణ చేయించాలన్నారు. రైతు నగర్ ముందు పంచాయతీలో ఉండేదని తెలిపారు. నాడు ఉన్న సర్పంచులు, పంచాయతీ అధికారులు, ఎండిఓలు, ఎమ్మార్వోలు, రిజిస్టర్ ఆఫీస్ అధికారులు, స్టాంపర్లు, నేడు మున్సిపాలిటీలో కలిసిన తర్వాత మున్సిపల్ అధికారులు, ఎమ్మార్వోలు రిజిస్టర్ ఆఫీస్ అధికారులు, స్టాంపులు రాసి అగ్రిమెంట్ చేసే వాళ్ళు అందర్నీ విచారణ చేయాలన్నారు. దివంగత ఎంపీ ఎస్పీవై రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా మోహన్ రెడ్డి మసీదు మాన్యాలు, మూలసాగరం, పీర్ల చావిడి మాన్యం కొనుగోలు చేసి పేదలకు పట్టాలు ఇచ్చారని, అవి కొనుగోలు అవుతాయా కబ్జాలు అవుతాయా అని ప్రశ్నించారు. వీటన్నింటిపైన జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములపైన హైకోర్టు రిటైర్డ్ జడ్జితో రిటైర్డ్ కలెక్టర్‌తో ప్రస్తుతం ఉన్న జిల్లా రిజిస్టర్ ఆఫీస్ అధికారులతో విచారణ జరిపించాలని కోరారు. ప్రస్తుతం అక్కడ కొనుగోలు చేసిన వారికి న్యాయం చేయాలని, అక్కడి భూముల విషయం ప్రస్తుత ఎమ్మెల్సీలు ఫారుక్, ఇసాక్ భాషా, మాజీ ఎమ్మెల్యే శిల్పా మోహన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి అందరికీ తెలిసిందేని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే విచారణ జరిపి వక్ఫ్ ఆస్తులు కాపాడాలని కోరారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పొంగిపొర్లుతున్న డ్రెయినేజీలు

- కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం బొల్లవరం గ్రామంలో గాంధీ సెంటర్‌కు వెళ్లే రహదారిలో డ్రెయినేజీ కాలువల మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతోంది. కాల్వలో చెత్తాచెదారం నిండిపోవడంతో మురుగు నీరంతా రోడ్డు మీద పారుతూ, నిలబడి దుర్వాసన వెదజల్లుతోంది. ఎటు చూసినా చెత్తాచెదారంతో డ్రెయినేజీ కాలువలు నిండిపోవడంతో దోమలకు ఆవాసంగా మారింది. తద్వారా మలేరియా, డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావున గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోతే సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువ. ఇప్పటికైనా గ్రామ సచివాలయ అధికారులు గ్రామంలో పర్యటించి డ్రెయినేజీ కాల్వలను శభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

సిఎం గారూ.. 1998 డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయండి..

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 1998 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని 1998 డిఎస్సి అభ్యర్థుల సంఘం నాయకులు ఈపనగండ్ల శ్రీనివాసులు, సంజీవ, చెన్నయ్య, సుందరం తదితరులు కోరారు. ఆదివారం పట్టణంలోని బృందావనం బిఈడి కళాశాలలో వారు మీడియాతో మాట్లాడారు. 1998 డీఎస్సీ బ్యాచ్‌లో 6754 మంది అర్హత కాగా అందులో ప్రభుత్వం 4072 మందికి ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మిగిలిన 2,682 మందికి ఉద్యోగాలు రాకపోవడంతో వారు తీవ్ర వేదనకు గురవుతున్నారని తెలిపారు. కేవలం విద్యాశాఖ మంత్రి అలాగే సంబంధిత అధికారులు తీసుకోవాల్సిన రీతిలో చర్యలు తీసుకోకపోవడం వల్లే అర్హులైన తమకు ఇప్పటివరకు పోస్టింగులు లభించడం లేదన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో కృష్ణయ్య, సుబ్బరాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఈపనగండ్ల శ్రీనివాసులు

కమాల్ హుస్సేన్ ఆశయ సాధనకు కృషి : సిపిఐఎంఎల్

ప్రజాశక్తి - నంద్యాల

ఐఎఫ్‌టియు నంద్యాల డివిజన్ కార్యదర్శి, సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ దివంగత నాయకులు కమాల్ హుస్సేన్ ఆశయ సాధనకు కృషి చేద్దామని సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్, పిడిఎస్యు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి రఫీ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఎస్.చౌడప్ప అధ్యక్షతన కమాల్ హుస్సేన్ నాలుగో వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమాల్ హుస్సేన్ విద్యార్థి దశ నుండి వామపక్ష సిద్ధాంతాలకు ఆకర్షితుడై, విద్యార్థి రంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. అనంతరం కార్మిక వర్గ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశాడన్నారు. సంఘటిత, అసంఘటితరంగ ఆటో, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై, హమాలీల సమస్యలపై అనేక పోరాటాలు చేశాడని తెలిపారు. తుది శ్వాస వరకు ఆయన విప్లవ రాజకీయ సిద్ధాంతాలకు కట్టుబడిన కార్మిక నేత అన్నారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కోశాధికారి ఎస్.చౌడప్ప, డివిజన్ సహాయ కార్యదర్శి రఫీ, సామెల్, ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ నాయకులు యాకూబ్, కిరణ్, పఠాన్, ఎఐకెఎంఎస్ నాయకులు కాజా మియా, పిడిఎస్‌యు నాయకులు షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

కమాల్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న

మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి రణధీర్ తదితరులు

నిత్యవసరాల ధరలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర వ్యాప్తంగా నిత్యావసర ధరలు కూరగాయల, గ్యాస్, విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు డి. రామ్ నాయక్, జి నాగేశ్వరరావు, ఏ సురేంద్ర, షేక్ ఇస్మాయిల్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాలు కూరగాయలు కొనలేని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇవికాక వంట గ్యాస్, విద్యుత్ చార్జీల ధరలూ పెరిగడంతో సామాన్యులకు భారీగా ఆర్థిక భారం పడుతోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలు తగ్గించడంలో ఘోరంగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా తక్షణమే నిత్యావసర ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచెర్ల

వ ట్ట ణ ం లో ని మంగళగిరి (సుబ్బారెడ్డి నగర్) కాలనీకి చెందిన షేక్ బాబు సాహెబ్ పెద్ద కుమారుడు ఎస్. హుస్సేన్ బాష (32) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షేక్ బాబు సాహెబ్ శనివారం నాడు తన తమ్ముడి పెళ్లి కోటపేటలోని వివాహంలో పాల్గొని, రాత్రి ఇంటికి వెళ్లి బనగానపల్లెకు వెళ్లే క్రమంలో రోడ్డులో పాలిష్ ఫ్యాక్టరీ దగ్గర ఉన్న చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య షాహినా, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి టి.గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో టాటా మ్యాజిక్ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం వి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక నిరుద్యోగంతో ప్రైవేట్ ఫైనాన్స్లో అప్పులు చేసి ఆటో నడుపుకుంటూ కుటుంబంలో పోషించుకుంటున్నారని అన్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి నేటికీ నాలుగేళ్ల నరకావస్తున్న హామీని అమలు చేయలేదు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ ,డీజిల్, ఆటో స్పేర్ పార్ట్స్ ధరలు పెంచి ఆటో కార్మికుల పైన అనేక భారాలు వేయడం జరుగుతుందన్నారు. తక్షణమే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేసారు. లేనిపక్షంలో ఆటో కార్మికుల సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం టాటా మ్యాజిక్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, కే వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కాజా, సహాయక కార్యదర్శి వెంకటేశ్వర్లు, ట్రెజరీగా పి సుభాన్, వీరితోపాటు ఐదుగురు కమిటీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్, మధు గౌడ్, శివ, సురేష్, తదితర ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కంది, ఆముదాలకు బీమా అందించాలి

ప్రజాశక్తి-డోన్

కంది, ఆముదాల పంటలకూ రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని నంద్యాల జిల్లా వినియోగదారుల రక్షణ సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్‌లోని ముక్తేశ్వర ఆలయం నందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా వినియోగదారుల రక్షణ సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయాన్ని నమ్ముకుని వేరుశనగ,పత్తి పంటలలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో దేశానికి ఆదర్శంగా అందజేశారని అన్నారు. కొన్ని పంటలకు నష్టపరిహారం రాలేదని వాటికి పరిహారం ఇవ్వాలని కోరారు. డోన్ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రాష్ట్రానికి ఆదర్శంగా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. కొండ పేటలో రైల్వే గేటు కర్నూలు గేట్ల మధ్యన అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం హర్షణీయం అన్నారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పూర్తయితే కొండపేటకు పూర్వవైభవం వస్తుందన్నారు. హిందూ స్మశాన వాటికకు ప్రభుత్వ ఆసుపత్రికి అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఎంతో ఉపయోగప డుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ మండల ఉత్తమ రైతులు బ్రహ్మానంద రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నంద్యాల జిల్లా వినియోగదారుల రక్షణ సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏఈ.నాగరాజు గౌడ్

చల్లా కుటుంబ సభ్యులపై కేసు నమోదు

ప్రజాశక్తి - అవుకు

చల్లా కుటుంబంలో శనివారం జరిగిన కుటుంబ విభేదాల్లో ఒకరిపై నొకరు పరస్పర దాడులు చేసుకున్న ఘటనలో ఇరు వర్గాలకు చెందిన ఆరు మందిపై కేసు నమోదు చేసినట్లు బనగానపల్లె సిఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం సిఐ విలేకరులతో మాట్లాడుతూ చల్లా రాజశేఖర్ రెడ్డి వర్గానికి చెందిన చల్లా రఘునాథరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిలతో పాటు చల్లా శ్రీ లక్ష్మీ వర్గానికి చెందిన చల్లా విక్రాంత్ రెడ్డి,చల్లా చరణ్ రెడ్డి,చల్లా చైతన్య రెడ్డిలపై కేసు నమోదు చేశామన్నారు.

చల్లా చరణ్ రెడ్డి కారు ధ్వంసం

చల్లా నివాసం వద్ద ఉంచిన చల్లా చరణ్ రెడ్డి కారును శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు పగలగొట్టి ధ్వంసం చేశారు. గొడవ జరిగిన రాత్రే కారును ధ్వంసం చేయడంతో చల్లా కుటుంబ సభ్యుల రాజకీయం మరింత వేడెక్కింది.కారును ఎవరు ధ్వంసం చేశారన్నది ఇంకా తెలియరాలేదు.పూర్తి విషయాలు పోలీసుల విచారణలో తేలనుంది.ఘటనకు కారణమైన ఈ 6 మందిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సిఐ తిమ్మారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మరల పునరావృతం అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సిఐ వెల్లడించారు.ఎవరైనా ప్రజలను భయభ్రాంతులకు చేసే విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

ఎంపిటిసి కనకమ్మ మృతి

ప్రజాశక్తి - వెలుగోడు

మండలంలోని అబ్దుల్లాపురం ఎంపిటిసి కంచర్ల కనకమ్మ (55) బోన్ కాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందింది. ఆదివారం ఆమె మృతికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్ర పాణి రెడ్డితో పాటు శ్రీశైలం నియోజకవర్గం సమన్వయ కర్త శిల్పా భువనేశ్వర రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డిలు సంతాపం తెలియజేశారు. ఎంపీపీ రమేష్, వెలుగోడు సర్పంచ్ జైపాల్, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, నంద్యాల జిల్లా కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఎంపిటిసి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ లాలం రమేష్ ఎంపీటీసీ కనకమ్మ కుటుంబానికి అంత్యక్రియలకు రూ.10 వేలను అందజేశారు.

అక్రమంగా వెళసిన వెంచర్లు

రియల్ మాఫియా

- నందికొట్కూరులో పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు..
- మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి !
- పట్టించుకోని కుడా, మున్సిపల్ శాఖ అధికారులు
- నోటీసులతో సరిపెట్టుకుంటున్న వైనం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రహదారిలో అక్రమ వెంచర్లకు తెరలేపారు రియాల్టర్లు. అమాయక ప్రజలను నమ్మించి ఎలాంటి అనుమతులు లేని వెంచర్లలో రూ.లక్షలకు లక్షలు వసూళ్లు చేసి అమ్మకాలు జరుపుతున్నారు. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల పరిధిలో వెంచర్లు అన్ని అనుమతులతో వేయాలని నిబంధనలతో జిఓ నెంబర్ 145 విడుదల చేసింది. అయితే ప్రభుత్వ నియమ నిబంధనలు, మున్సిపల్ యాక్ట్ ప్రకారం నందికొట్కూరు మున్సిపాలిటీలలో నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు రియాల్టర్లు. ఎక్కడపడితే అక్కడ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకు ండానే అక్రమంగా వెంచర్లను వేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని పలు విమర్శలు వినిపి స్తున్నాయి. రియల్ మాఫియా యజమానులకు అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్న కొందరు మున్సిపల్ శాఖ, 'కుడా' అధికారులు అండగా ఉంటూ చోద్యం చూస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. దీని వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడడమే కాకుండా ప్రజలూ నష్టపోతున్నారు.

కర్నూలు రహదారిలో మున్సిపల్ అధికారులు గతంలో అక్రమ వెంచర్లో రాళ్ళు పాతినవి రాళ్ల తెచ్చారు. వెంచర్లు ఇష్టారాజ్యంగా వేస్తున్న పట్టించుకోవాల్సిన మున్సిపల్, కుడా అధికారులు రియల్టర్లకు నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చిన అప్పుడు మాత్రమే అనుమతులు లేని వెంచర్లపై యజమానులకు నోటీసులు ఇవ్వడం లేదంటే వెంచర్లను పరిశీలించి మామ్ముళ్ళు తీసుకొని వదిలేస్తున్నట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నియమ నిబంధనలు జీవో నెంబర్ 145 ప్రకారం ఎకరా స్థలంలో 5శాతం ప్రభుత్వ గృహాలకు పేదలకు కేటాయించాలి. అందులో ప్రభుత్వం పేదలకు ఇళ్ళ నిర్మాణం చేపడుతుంది. ఒకవేళ 5శాతం వెంచర్ యజమాని కేటాయించడం ఇష్టం లేకపోతే స్థలానికి సంబంధించిన 3 కిలోమీటర్లు దూరంలో 5 శాతం మార్కెట్ విలువ రేటు ప్రకారం మొత్తం ప్రభుత్వానికి డిపాజిట్ చేయాలి. కానీ నందికొట్కూరులో ప్రభుత్వ నియమ నిబంధనలు కానీ మున్సిపల్ యాక్ట్ ప్రకారం లే అవుట్లు కానీ వేయడం లేదు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూమిగా మార్పుకు ప్రొసీడింగ్స్ ఇస్తారు ఆర్‌డిఓ. ఆ తరువాత లే అవుట్ అప్రూవల్ కుడా అధికారులు వద్ద తీసుకోవాలి. కుడా అధికారులు పరిశీలించి వారు అప్రూవల్ ఇస్తే వెంచర్ వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. వెంచర్‌లో మార్కెట్ విలువ ఎంతైతే ఉందో అందులో 5 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. ఓపెన్ స్థలాలకు వెంచర్ ఏకర వేస్తే అందులో 10 శాతం భూమి మున్సిపాలిటీకి, 2 శాతం ఇతర అవసరాలకు కేటాయించాలి. తప్పనిసరిగా 40 అడుగుల అప్రోచ్ రహదారి వేయాలి. వీటన్నిటిని చెల్లిస్తే మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం వుంటుంది. ఇన్ని నిబంధనలు ఉన్నప్పటికీ కర్నూలు రహదారిలో వెలసిన వెంచర్లకు కనీస అనుమతులు కూడా లేకుండా వెంచర్లు వేశారని పెద్దఎత్తున్న ఆరోపణలు వస్తున్నాయి. కర్నూలు రోడ్డులో దాదాపు 30 ఎకరాలకు పైగా వెంచర్లు వేశారు. ఇందులో ప్రస్తుతం ఉన్న మార్కెట్ రేటు ప్రకారం ఒక ఎకరా రూ.1.5 కోట్ల పైమాటే. ఒక ఎకరా వెంచర్ వేస్తే మున్సిపాలిటీకి ఎకరాకు 10 సెంట్ల చొప్పున వెంచర్ల యజమానులు ఇస్తే అందులో ఆదాయం ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.30 లక్షలు. 30 ఎకరాల్లో దాదాపు 3 ఎకరాలుమున్సిపాలిటీ కి స్థలం ఇవ్వాలి. మున్సిపాలిటీ ఆదాయానికి అక్రమ వెంచర్ల వల్ల వచ్చే నష్టం రూ.కోట్ల పై మాటే. ఇలా చెప్పుకుంటూ పోతే ఇప్పటి వరకు రూ.4.5 కోట్లపైగా నే మున్సిపల్ ఆదాయానికి, ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నష్టం జరిగి ఉండవచ్చని పట్టణ ప్రజలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కర్నూలు రోడ్డులోని అక్రమంగా వెళసిన ఓ వెంచర్

అనుమతులు లేని వెంచర్లను తొలగిస్తాం

- పి.కిషోర్, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్

పట్టణంలో అనుమతులు లేకుండా కొన్ని వెంచర్లు ఉన్న మాట వాస్తవం. ఇప్పటికే మొదటి నోటీసులు అందజేశాము. 7 రోజుల్లో అనుమతులు లేకుండా ఎందుకు వెంచర్లు వేశారో సమాధానం చెప్పాలి. చెప్పకపోతే రెండవ నోటీసు ఇస్తాం. వాటికి సమాధానం ఇవ్వకపోతే స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చి వెంచర్లలో రోడ్లు,కాంపౌండ్ వాల్, రాళ్లు అన్ని ఉన్నతాధికారులకు తెలిసి వారి ఆదేశాల మేరకు తొలగిస్తాం. త్వరలో అనుమతులు లేని వెంచర్లపై టౌన్ ప్లానింగ్ అధికారులు, కర్నూల్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం.

వినియోగ దారులు లేక వెలవెలబోతున్న కూరగాయల మార్కెట్

బోసిపోయిన కూరగాయల మార్కెట్

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి వర్ష ప్రభావం అంతంత మాత్రమే ఉండడంతో కూరగాయల దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో మార్కెట్లో కూరగాయల ధరలు మండుతున్నాయి. ఇప్పట్లో ఎప్పుడు లేని విధంగా టమోటా, పచ్చిమిర్చి ధరలు కేజీ రూ.140పైన పలుకుతుండడంతో సామాన్యులు కొనలేని స్థితిలో ఉన్నారు. ప్రతి ఆదివారం బేతంచెర్ల పట్టణంలో జరిగే సంతలో కూరగాయల ధరలు ఆకాశంలో అంటడం సంత మార్కెట్ వెలవెల పోయింది.

క్లబ్ అధ్యక్షురాలుగా సేవలు అందించిన ఆర్ టిసి ఆర్ఎ శాంతి ని సన్మానిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-డోన్

ఇన్నర్ వీల్ క్లబ్‌లో చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని ఇన్నర్ విల్ క్లబ్ ప్రెసిడెంట్ కె.షాలిని ప్రకాష్ అన్నారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం శారద స్వగృహంలో సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకుండా ఉండాలని మెహంది నిర్వహించారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ 2022-23 సంవత్సరంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలుగా ఆర్‌టిసి ఆర్ఎ శాంతి సమాజంలో ఎన్నో సేవలందించారని కొనియాడారు. ఒక పక్క కండక్టర్‌గా ఉద్యోగం చేస్తూ ఇన్నర్ విల్ క్లబ్‌లో ప్రెసిడెంట్‌గా ఉంటూ ప్రజలకు నిత్యం సేవలందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ నందు ఆర్ఎ శాంతిని, కాబోయే డిస్టిక్ చైర్మన్ సుమిత్రలను ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన సభ్యులకు అందరికీ చైర్మన్ సుమిత్ర, శాంతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సరోజమ్మా,రాధరెడ్డి,శకుంతల, రాజకుమారి,అనురాధ,పి.పద్మ,ఝాన్సి,రాజా సుజాత,ఆలాకృష్ణవేణమ్మ,విజయలక్ష్మి, మద్దమ్మ, సూర్యకుమారి, అనంతలక్ష్మి, పద్మజ,శైలజ,సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.

13న తలనీలాల వేలం

ప్రజాశక్తి - బేతంచెర్ల



మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీన భక్తులు సమర్పించిన తలనీలాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతా రామ చంద్రుడు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సంవత్సర కాలంగా భక్తులు సమర్పించిన తలనీలాలను వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆలయ నిబంధనల మేరకు ధరావత్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవలసిందిగా వారు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పగిడ్యాల

ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్సై నాగార్జున ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలం లోని ప్రాతకోట గ్రామంలో భాస్కాపురం వెళ్లే రస్తా చర్చి సమీపాన ఏపీ 39 టిటి 0912 అశోక లేలాండ్‌లో 80 ప్యాకెట్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన దూదేకుల కాశీం, ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పల్లె వరప్రసాద్, కాటేపోగు శివప్రసాద్, దూదేకుల దర్గయ్య అందరూ కలిసి మండలంలోని ఆయా గ్రామాలలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి దోర్నాల, మార్కాపురం, కుంట, గ్రామాలలో ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు ఇక్కడి నుంచి తరలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టుకున్న వాహనంతో ముచ్చుమర్రి పోలీసులు

శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ

- మహాశివరాత్రిని తలపించిన భక్తులు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగి మహాశివరాత్రిని తలపించింది. క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండవ శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు రోజులు కలిసి రావడంతో స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండి కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకున్నారు. తెల్లవారుజామున 4-30 గంటల నుండి స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మహ మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. భక్తులు అడిగిన అన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్న కమ్యూనిటీ సత్రాలు భక్తులతో నిండిపోయాయి. దేవస్థానం గదులు, కాటేజీలు, సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఇంకా అనేకమంది భక్తులు గదులు దొరకక ఇబ్బందులు పడ్డారు.

ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని ఎన్‌విఎస్ రోటరీ భవన్‌లో రోటరీ క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి అధ్వర్యంలో ఉచితంగా చిన్మయ ఎయిడెడ్ స్కూల్ విద్యార్థులకు పది వేల రూపాయల విలువ గల నోట్ పుస్తకాలను క్లబ్ సభ్యులు మాలేపాటి రాజశేఖర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి మాట్లాడుతూ కొనుగోలు చేయడానికి వనరులు లేని పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ అన్ని విధాలుగా ఆదుకుంటుందని, విద్య విషయంలో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. పేద విద్యార్థుల భవిష్యత్తుకు దోహద పడతామని అన్నారు. రోటరీ క్లబ్ పిడిజి కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థ అని, నోట్ పుస్తకాల పంపిణీ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు తోడ్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌సి మోహన్ రెడ్డి, ట్రెజరర్ కే.బాలకృష్ణ, సభ్యులు సుధా మోహన్ రెడ్డి, రామ సుబ్బయ్య, ప్రసాద రెడ్డి, నాగ రాజారావు, రాగి రమేష్, సత్యనారాయణ, విజయశేఖర్ రెడ్డి, విశ్వనాథ్, అశోక్ రెడ్డి, గుప్తా, ధనుంజయ, ఎల్.భూషణం, చిన్మయ స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణి చేస్తున్న దృశ్యం

యోగాతో అనేక ఉపయోగాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

యోగా ప్రాణాయామం చేయడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని కెవి సుబ్బారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ మల్లేశ్వర్ రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని శిల్పా నేచర్ హోమ్స్ ఆవరణలోని రోటరీ ఆరోగ్య వేదిక వద్ద ఆదివారం ఏరోబిక్స్ వ్యాయామ శిక్షణ శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మల్లేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యోగా ప్రాణాయామం నిరంతర సాధన వల్ల మంచి ఆరోగ్య ఫలితాలు ఉంటాయన్నారు. రోటరీ ఆరోగ్య వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ రాంగోపాల్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఆరోగ్య వేదిక సభ్యులకు, క్రీడాకారులకు డాక్టర్ ప్రసాద్ క్లాప్ థెరపీలో శిక్షణ ఇచ్చారు. స్థానిక శ్రీ సాయి న్యూట్రిషన్ సెంటర్ నిర్వాహకులు నరసింహులు ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగం గురించి వివరించారు. సభ్యులందరికీ ఆర్గానిక్ తేనీటి విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, ఎల్ఐసి శ్రీనివాస్, కళాశాల విద్యార్థులు, ఆరోగ్య వేదిక సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

యోగా చేస్తున్న దృశ్యం

మౌళిబాషాకు శుభాకాంక్షలు తెలిపిన డివిజన్ అధ్యక్షులు నరసరాజ్

విఆర్ఎ సంఘం రాష్ట్ర కోశాధికారిగా ఎ.మౌళి బాష

ప్రజాశక్తి - నందికొట్కూరు

విఆర్ఎల ఎపి కోశాధికారిగా ఎ. మౌళి బాషా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నికలు ఆదివారం విజయవాడలో గాంధీ నగర్‌లోని ఏపి ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగాయి. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు అయిన ఎ. మౌళి బాషాను రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక పట్ల ఉమ్మడి కర్నూలు డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరసరాజు హర్షం వ్యక్తం చేస్తూ మౌళి బాషకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరసరాజు మాట్లాడారు. బ్రాహ్మణకొట్కూరు గ్రామ నివాసి మౌళి బాష రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఉమ్మడి కర్నూలు జిల్లా విఆర్ఓలకు గర్వకారణం అని పేర్కొన్నారు. అనంతరం ఆయనకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల, అధ్యక్షులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారన్నారు.

వైద్యం కోసం వేచి ఉన్న ప్రజలు

కేరళ ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆత్మకూర్

శ్రీశైల నియోజవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో నిర్వహించిన కేరళ ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక మార్కెట్ యార్డ్ నందు శని, ఆదివారాల్లో కేరళకు చెందిన ఆయుర్వేద వైద్యులు వివిధ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి ఆయుర్వేదిక మందులను అందించారు. ఈ శిబిరానికి మండలం లోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఉచిత వైద్య సేవలను పొందారు.